

# రెక్కలొచ్చిన పక్షులు

— రావినూతల సువర్ణాక



రాజారావుగారి లోగిలంతా జనంతో కిటకిటలాడి పోతోంది. అందరి మొహాల్లోనూ ఆందోళన తొంగి చూస్తోంది.

లోపల ఓ విశాలమైన గదిలో రాజారావుగారు అపస్మారక స్థితిలో వున్నాడు. ఆయన భార్య సీతమ్మ తలవైపు కూర్చుని పొర్లుకొస్తున్న దుఃఖాన్ని అతి ప్రయాసగా ఆపుకోవాలని ప్రయత్నిస్తోంది. ఆ వూళ్ళోనే సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న పాతికేళ్ళ అతుల్ ఆమెని ఓదారుస్తూ డాక్టర్‌కి కావల్సినవి అందిస్తున్నాడు.

రాజారావుగారికి సుమారు ఎనభై ఏళ్ళుంటాయి. ప్రిన్సిపాల్‌గా చేసి రిటయిరయ్యాడు. ఆయనకి, ఆయన భార్యకి కూడా చదువుకునే పిల్లలంటే చాలా అభిమానం. ఆ అభిమానం తోనే ఎంతోమంది పేద విద్యార్థులకి అన్నివిధాలా సాయం చేసేవారు.

అతుల్ వాళ్ళింట్లో వారాలు చేసుకుని చదువుకునే వాడు. నా అన్నవాళ్ళెవరూ లేని అతనికి ఆ దంపతు లంటే ఎంతో అభిమానం.

రాజారావుగారికి ఇద్దరు మగ పిల్లలు. ఒక ఆడపిల్ల. అందరికీ పెళ్ళిళ్ళయిపోయాయి.

పెద్దకొడుకురాజు ఢిల్లీలోనూ, చిన్నకొడుకు చిన్న బాంబేలోనూ, కూతురు మెడ్రాస్‌లోనూ వున్నారు.

నిజానికి రాజారావు గారు ఏనాడూ చిర్రున చీది ఎరగరు. కానీ ఇప్పుడు హఠాత్తుగా ఆయనకి హార్టెటాక్ వచ్చింది. పిల్లలకి కబుర్లు వెళ్ళాయి. ప్రస్తుతం వాళ్ళ కోసమే ఎదురు చూస్తున్నారంతా.

మరో గంటకల్లా కూతురు, ఆ తర్వాత కొడుకులు దిగారు, కోడళ్ళతో సహా.

పిల్లల్ని చూసేసరికి అంత వరకు అణిచి పెట్టుకున్న దుఃఖం పొంగి పొరలింది సీతమ్మకి. తల్లిని ఓదార్చారు పిల్లలు.

పిల్లలు వచ్చాక కొండంత ధైర్యం వచ్చింది సీతమ్మకి. పిల్లలు డాక్టర్ని ఇవతలగా పిల్చి తండ్రి పరిస్థితి అడిగారు.

"చెప్పలేం..స్పృహరావాలి" ఏదో ఆలోచిస్తూ అన్నాడు డాక్టరు.

శవాకారంలా పడున్న తండ్రిని చూసి కంటతడి పెట్టుకున్నారు కొడుకులు, కోడళ్ళూ. బావురుమని ఏడ్చింది రమ. ఆమె భర్త దిగులుగా ఓ మూల నిల్చున్నాడు.

రాజారావుగారికి హాస్పటలంటే ఇష్టం లేదని అందరికీ తెలుసు. అందుకే ఇంటినే ఓ హాస్పటల్‌గా తయారు చేశాడు అతుల్ తల్లో.

"ఇంక పరవాలేదుగా!" మర్నాడు తండ్రిని చూస్తున్న డాక్టర్ తో అన్నాడు రాజా.

"చెప్పలేం. ఆక్సిజన్ అవీ పెట్టాంగా. ఓవారం గడిస్తే. గండం గడవచ్చు" అన్నాడతను.

రెండురోజులకి రాజారావుగారికి స్పృహ వచ్చింది. అందరి మనసులూ తేరుకున్నాయి.

"చాలా జాగ్రత్తగా చూడాలి. ఒంటరిగా వదిలి ఎక్కడికీ వెళ్ళకండి" అన్నాడు డాక్టర్.

సీతమ్మ మొహంలో రవంత వెలుగు తొంగి చూసింది.

"డాక్టర్‌గారూ, ఎన్నాళ్ళనించో మా పిల్లలు తమ దగ్గర కొచ్చి వుండమంటున్నారు. కాలూ చెయ్యీ బావుండే ఒకళ్ళమీద భారం ఎందుకు అంటూ తీసి పారేశారాయన. ఇప్పుడు మీరు వెళ్ళచ్చంటే ఢిల్లీనే, బొంబాయో వెళ్ళిపోతాం" అంది ఆత్రుతగా.

"ఇప్పుడొద్దమ్మా. కాస్త తేరుకున్న తర్వాత ఫ్లైట్‌లో తీసికెళ్ళురుగాని" అన్నాడతను.

సీతమ్మ మనసు కాస్త కుదట పడింది. ఒంటరిగా వుంటే ఆమెని ఎన్నో ఆలోచనలు వుక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి.

వారం రోజులు గడిచిపోయాయి. రాజారావు కాస్త తేరుకున్నారు.

ఇంక భర్తతో ప్రయాణమై ఢిల్లీ వెళ్ళడమే తరువాయి, అన్న ధ్యాసలో వున్న సీతమ్మ తనవి, భర్తవి బట్టలు సర్దింది. ఫ్లైటుకి టికెట్స్ తెప్పించమని చెప్పడానికి కొడుకు దగ్గరి కొచ్చింది.

"ఏమిటమ్మా!" అన్నాడు రాజా.

"మీనాన్నకి కాస్తకులాసాగానే వుందిగా. రేపటికి ఫ్లైటుకి టికెట్స్ తెప్పించెయ్యి" అంది సీతమ్మ మంచం మీద కూర్చుంటూ.

"తెప్పించేశానమ్మా! నాన్న కింక ఏంభయం లేదన్నారు డాక్టర్ గారు. అందుకే మేం వెళ్ళిపోతాం" అన్నాడు రాజా.

"మీరు వెళ్ళిపోతారా!" అర్థం కానట్టు చూసింది సీతమ్మ.

"అవునత్తయ్యా ఈయనకి శలవు లేదు. నయం, రెండు టికెట్స్ వున్నాయట. మీరేం దిగులు పడకండి. మళ్ళీ వీలు చూసుకుని మేం వస్తాం" అంటూ వచ్చింది కోడలు.

ప్రతిమలా అయి పోయింది సీతమ్మ. భర్త గురించి తను డాక్టర్ని అడగడం, డాక్టర్, ఆయన్ని ఢిల్లీ తీసికె ళ్ళచ్చు అనడం అందరూ విన్నారు. అంటే, తమని తీసికెళ్ళడం వాళ్ళకి ఇష్టం లేదన్నమాట; అనుకుంది. ఇంక మాట్లాళ్ళేదు. నాలుగు ధైర్య వచనాలు చెప్పి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు, కూతురితో సహా.

డాక్టరు, అతుల్, సీతమ్మ కలిసి రాజారావుగారిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. వారం రోజుల తర్వాత మళ్ళీ ఎటాక్ వచ్చింది రాజారావుగారికి.

డాక్టర్లు అయిపోయిందన్నారు. సంధి ప్రేలాపన మొదలయింది.

అతుల్ మళ్ళీ రాజాకి ఫోన్‌చేశాడు. లైన్ దొరికాక సీతమ్మ కిచ్చాడు. గద్గద స్వరంతో భర్త పరిస్థితి చెప్పింది సీతమ్మ.

కొడుకు క్షణం మౌనంగా వుండి పోయాడు. "వెంటనే బయల్దేరి రారానాన్నా. ఆయన్ని చూస్తుంటే నాకు భయంగా వుంది" దీనంగా అందామె.

"డాక్టరేమన్నాడు!" అన్నాడతను.

"చెప్పలేం అన్నాడు. మీరంతా వెంటనే బయల్దేరిరండి".



"ఆవచ్చు, కానీ నాకు శలవు లేదమ్మా" గొణిగినట్లు అన్నాడు రాజు.

సీతమ్మ మొహం వెలవెల పోయింది. "అయితే ఎలాగురా! ఇలాంటి సమయంలో ఒంటరిగా నేనుండ లేనురా! అందులో కింద పెట్టేశాం కూడా మీరు రాకపోతే ఎలా! అందునా పెద్ద కొడుకివి" ఆమె గొంతు ఒణికింది.

"రావాలనే వుంది. తీరా వచ్చాక..."

"ఆయన కోలుకుంటారని భయమా!" సీతమ్మ గొంతులోకి తీక్షణతవచ్చేసింది.

"ఛ!ఛ! అదేంకాదు. నరే నేనొస్తున్నాను నువ్వేం కంగారు పడకు" అంటూ ఫోన్ పెట్టేశాడు రాజు. తర్వాత చిన్న కొడుక్కి ఫోన్ చేసింది సీతమ్మ.

"అదేవిటి మొన్న బానే వున్నారుగా!" తల్లి చెప్పిన విషయాలు విని అన్నాడు చిన్న.

"నేనూ అదే ఆశ వడ్డాన్రా చిన్నా కాని మీనాన్న వరిస్థితి.." దుఃఖంలో ఆమెకి గొంతు పెగల్లేదు.

"నువ్వేం కంగారు వడకమ్మా! పెద్ద తనం కదా..ప్రాణి ఓ వట్టాన పోదు. వీలు చూసుకుని వస్తాను..ఇవాళే వచ్చి నేను మాత్రం ఏం చేస్తాను. తీరా వచ్చాక ఆయన....."

"చిన్నా" అతని మాట పూర్తి కాకుండానే అంది సీతమ్మ.

అప్పుడు తనేం మాట్లాడాడో గ్రహించాడు చిన్న. తల్లితో అలా మాట్లాడి వుండ కూడదు అనుకున్నాడు తర్వాత.

"ఇవాళే బయల్దేరతాను" అంటూ హామీ ఇచ్చాడు.

సీతమ్మ మొహం నెత్తురు బొట్టు లేనంతగా పాలి పోయింది.

భర్త అవసాన కాలంలో వున్నాడన్న బాధకన్నా కొడుకులు మాట్లాడిన తీరే ఆమెని మరింత బాధ పెట్టింది.

విషయం విన్న అతుల్ కూడా బాధ పడ్డాడు. తర్వాత ఆవిణ్ని వూరడించాడు.

అతి భారంగా తెల్ల వారింది. రాజారావుగారి పరిస్థితిలో పెద్దగా మార్పేం లేదు. వచ్చేపోయే జనంతో కిటకిటలాడి పోతోందా ప్రాంగణమంతా.

మర్నాడు చిత్రంగా రాజారావుగారు కళ్ళు తెరిచాడు. పొంగి పోయింది సీతమ్మ.

"ఎలా వుందండీ!" చిక్కిన ఆయన చెంపలు నివురుతూ అడిగింది.

ఆయన చిన్నగా నవ్వాడు.

"పిల్లలొచ్చారా!" అన్నాడు నీరసంగా.

సీతమ్మ గుండె జల్లు మంది.

"వస్తారు. మీరు పడుకోండి" అనునయంగా అంది. మనసులో మాత్రం భర్త కోలుకున్నందుకు పిల్లలు ఆనందిస్తారో, చిరాకు పడతారో అన్న భయం కొండలా పెరిగి పోతోంది.

మళ్ళీ అందరూ దిగారు. అయితే ఈసారి కోడళ్ళు, అల్లుడు రాలేదు. పోయిన కబురు తెలిశాక వస్తామన్నారుట.

కొడుకులిద్దరూ ఆతృతగా తండ్రి కోసం చూశారు. ఆయన శవం వీధిలో అంతిమ యాత్రకి సిద్ధం అవుతూంటుందని వాళ్ళు వూహించారు. కానీ ఆఛాయలేం వాళ్ళక్కనిపించలేదు.

"నాన్నేరే!" అన్నారు చెల్లెలితో. ఆమె తండ్రి దగ్గరికి తీసికెళ్ళింది.

సీతమ్మ భర్త దగ్గర కూర్చుని కమాలా పండు తినిపిస్తోంది. కొడుకులురాగానే ఎందుకో ఆమె గుండె దడదడ లాడింది భయం భయంగా వాళ్లని చూస్తు,

"దేవుడి దయవల్ల కాస్త తేరుకున్నార్రా రాజూ" అంది.

ఆమె వూహించిన భావం వాళ్ళ మొహాల్లో స్పష్టంగా కనిపించింది.

"కింద పెట్టేశారన్నావ్!" రాజు గొంతు తీక్షణంగా వుంది.

"నాకు శలవు లేకపోయినా లాసాఫ్ పేలో వచ్చాను" మొహం మాడ్చుకొని అన్నాడు చిన్న వాళ్ళిద్దర్నీ ఇవతలికి తీసుకొచ్చి, ఆయన పరిస్థితి ఎలా దిగజారిందీ, ఎంత కంగారు పడ్డారో, మళ్ళీ ఎలా తేరుకున్నారో వివరించాడు అతుల్. అయినా రాజూ వాళ్ళ మొహాల్లో మార్పులేదు. తమకి ఏదో అన్యాయం జరిగినట్టు మొహాలు మాడ్చు కున్నారు.

తండ్రి కోలుకున్నాడన్న ఆనందం కన్నా ఆయన ప్రాణం పోలేదన్న బాధే ఎక్కువగా కనిపించింది సీతమ్మకి.

"ఏమిట్రా రాజూ, కన్న బిడ్డలు దూరాభారాన వున్నారు. ఆయన ప్రాణం ఏక్షణానైనా పోవచ్చన్నారు డాక్టర్లు. మరలాంటప్పుడు ఫోన్‌చెయ్యకుండా ఎలా వుండన్రా?" అంది ఏడుస్తూ.

ఆవిడ మనసులో జరిగే సంఘర్షణ అతనికి తెలుసు. అయినా-

"మీరన్నది నిజమేనమ్మా! కానీ వాళ్ళ పరిస్థితులు..."

"ఏవిట్రా ఆ పరిస్థితులు! నాకూ, నీకూ తెలియని పరిస్థితులు ఏం వున్నాయ్?

"వాళ్ళు చేసే వుద్యోగాలు క్షణం తీరికలేని వుద్యోగాలు కావు. ఓ నెల్లాళ్ళు శలవు పెడితే కొంపలు మునిగేవి కావు. ఒక వేళ నిజంగానే శలవు దొరక్క వాళ్ళు రావడం కుదరక పోతే మమ్మల్నే తీసికెళ్ళచ్చుగా!.. మేం రానన్నప్పుడల్లా వాళ్ళు రమ్మని ప్రాణం తీశారు. తీరా వస్తాం అనగానే ఆమాటే విననట్టుండి పోయారు. రమ మాత్రం? తనకి పట్టనట్టు వెళ్ళిపోయింది. నువ్వే చెప్పు; పిల్లలు కావాలను కునేది ఎందుకురా!..."దుఃఖం, ఆవేశం, ఆవేదన అన్నీ కలిపిన గొంతుతో అంది సీతమ్మ.

అతుల్ మనసు బాధగా మూలిగింది.

"మీరు చెప్పింది నిజమేనమ్మా. కానీ రేపు వాళ్ళు" పరిస్థితి ఇలా వుంటే మాకు ఎందుకు తెలియ పరచ లేదంటూ మిమ్మల్ని నన్నూ కూడా నిందిస్తారు..." అన్నాడు మెల్లగా.

"పరవాలేదురా! వస్తూనే-"ఇంకాపోలేదా!" అంటూ

నిలదీసినట్టు అడిగే మాటకన్నా "మాకెందుకు తెలియ పరచలేదు!" అన్నమాట వినడం నాకు సులభం. పోవడం వుండడం అంతా మన చేతుల్లోనే వున్నట్టు, వాళ్ళు నిలదీశార్రా మొన్న" ఆమె గొంతు ఒణికింది.

పిల్లలు మాట్లాళ్ళేదు.

రెండు రోజులు గడిచి పోయాయి. ముళ్ళమీదున్న ట్టున్నారు పిల్లలు, ఎప్పుడు పోతాడా ఎప్పుడు ఇంత బూడిద చేసి పోదామా అన్నట్టు. అయితే వాళ్ళ ఆశ నెర వేరలేదు. రాజారావుగారు మళ్ళీ తేరుకున్నాడు.

ఆయనలోని మార్పుకి డాక్టర్లే ఆశ్చర్యపోయారు. పిల్లల మాత్రం సందిగ్ధావస్థలో పడ్డారు.

మరో నాలుగు రోజులకి రాజారావుగారు లేచి కూర్చున్నారు.

మునుపట్లాగే పొంగి పోయింది సీతమ్మ.

"ఇంక వెళ్తాం" అన్నారు పిల్లలు.

ఆమె సరే అన్నట్టు తలూపింది. వాళ్ళు వెళ్ళిపోయారు. వెళ్ళేటప్పుడు -

"నువ్వు అనవసరంగా కంగారు పడి ఫోన్లు చెయ్యకు. ఆమూల నించి ఈ మూలకి రావాలంటే మాకు చాలా ఇబ్బంది" అని చెప్పి మరీ వెళ్ళారు.

నిర్లిప్తంగా వుండి పోయింది సీతమ్మ. రోజులు మెల్లగా గడుస్తున్నాయి.

వారం రోజుల తర్వాత రెండు శుభలేఖలు వచ్చాయి రాజారావుగారికి. ఒకటి రాజు మామగారి షష్టి పూర్తిది, మరోటి చిన్నా అత్తగారి లక్షవత్తుల నోముదీను.

రెండు శుభలేఖలూ తీసికెళ్ళి భర్తకి చూపించింది సీతమ్మ.

"వెళ్తావా" అన్నాడు రాజారావుగారు.

"నేనా! మిమ్మల్నొదిలా!" ఆయన చేత హార్లిక్స్ తాగిస్తూ అంది సీతమ్మ.

"ఇక నాకేం పరవాలేదు సీతా! యముడితో పోట్లాడి వచ్చాను" నవ్వాడు రాజారావుగారు. సీతమ్మ కూడా తృప్తిగా నవ్వింది.

నాలుగు రోజుల తర్వాత ఓ రాత్రి రాజారావుగారికి సివియర్ హార్టెటాక్ వచ్చింది. హడలిపోయిన సీతమ్మ డాక్టర్‌కి ఫోన్ చేసింది. అతుల్‌ని పిలిపించింది.

"మీ పిల్లల్ని పిలిపించండమ్మా" అన్నాడు డాక్టర్ ఆవిణ్ని ఇవతలగా పిల్చి. సీతమ్మ మొహంలో రకరకాల భావాలు దోబూచు లాడాయి. "త్వరగా ఫోన్ చెయకపోతే వాళ్ళు అందుకోలేరమ్మా" అన్నాడు అతుల్.

"అతుల్; మీ మాస్టారు పోతారంటావా!" ఆమె గొంతు ఒణికింది. ఆమె ప్రశ్నకి తెల్లబోయాడు అతుల్.

"అదేం ప్రశ్నమ్మా!" అన్నాడు మెల్లగా.


"అవున్రా! మీ మాస్టారు మళ్ళీ లేస్తే?"

"లేస్తే అంతకన్నా కావల్సిందేం వుందమ్మా?"

"కానీ వాళ్ళలా అనుకోర్రా; ఇప్పటికే వాళ్ళు పన్లన్నీ వదులుకొని రెండు సార్లు వచ్చారు." అంత దూరాన్నించి పిల్లా జెల్లాతో రావడం అంటే మాటలా;" అంటూ విసుక్కున్నారట కోడళ్ళు. అలాంటప్పుడు ఈయన మళ్ళీ ...." దుఃఖంతో ఆమెకి మాట రావడంలేదు.

"ఛ...ఛ... మీరు మరీ దారుణంగా వూహిస్తున్నారమ్మా. రాజూ వాళ్ళూ మాస్టారి పిల్లలుగానే కాదు. నాకు నన్ని హితులుగా కూడా బాగా తెలుసు. అసలు మేస్టార్గానీ, మీకుగానీ ఏదైనా అయితే వాళ్ళు విలవిల్లాడిపోతారు. ఏదో పనుల వత్తిడిలో అలా అన్నారేమోగానీ... మీరంటే ప్రేమాభిమానాలు లేక మాత్రం కాదు" రాజూ వాళ్ళని సమర్థిస్తూ అన్నాడు అతుల్.

సీతమ్మ అదోలా నవ్వింది. "ఎందుకురా అతుల్", వాళ్ళని సమర్థిస్తావ్. కన్న తండ్రి ప్రమాద పరిస్థితిలో వుంటే, ఓ నెలా, రెణ్నెల్లు శలవు పెట్టి దగ్గరుండలేని కొడుకులూ ఒకకొడుకులేనా! ఎంతసేపూ ఆయన పోతే ఆయన్నికడ తేర్చి, చేతులు కడుక్కోవాలన్న ధ్యాసేతప్ప, ఆఖరిదినాల్లో ఆయన పక్కనుండి, ఆయనకి కొన్త మన శ్శాంతి ఇవ్వాలని ఒక్కళ్ళ కుందా! ఎందుకురా ఇలాంటి సంతానం? కొడుకుల్ని కనేది తలకొరివి పెట్టడానికి మాత్రమే కాదురా, జీవన సంధ్యలో ఇంత చల్లని నీడనిస్తారని కూడా. కాదంటావా!" ఆవేశంగా అంది.



## సాధన

'భరత నాట్యం క్లిష్టమైనది - కదలికలు పరిమితంగా వుంటాయి. కూచిపూడి విషయానికొస్తే—ఇందులో అభినయానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. కూచిపూడిలో అందం ఎక్కువ' అనేకుమారి సాధన తమిళుల అమ్మాయి. తండ్రి శఠగోపన్ ఢిల్లీలో ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసేవారు. ఆ కారణంగా ఢిల్లీలోనే పుట్టిపెరిగిన సాధన బి.కాం. డిగ్రీని కూడా అక్కడే పూర్తిచేశారు. అయిదు సంవత్సరాల వయసులోనే 'హాబీ'గా నృత్యాన్ని అభ్యసించిన సాధనలో క్రమేపీ నృత్యంపట్ల శ్రద్ధాసక్తులు పెరిగి 1974 లో సరోజా వైద్యనాథన్ వద్ద 'భరతనాట్యం' అభ్యసించడం ప్రారంభించారు. 1984 వరకూ ఆమెవద్ద భరతనాట్యంలో శిక్షణపొంది, 1985 లో తండ్రి ఉద్యోగ విరమణానంతరం హైద్రాబాదులో స్థిరపడి, శ్రీమతి ఉమారామారావు వద్ద భరతనాట్యంతో పాటు కూచిపూడి నృత్యాన్ని కూడా అభ్యసిస్తున్నారు.

1983 డిసెంబర్ 26 న ఢిల్లీలో ఆరంగేట్రం జరుపుకున్న సాధన ఒక్క ఢిల్లీలోనే రెండువందల ప్రదర్శనలు ఇచ్చింది. హైద్రాబాదు వచ్చిన తర్వాత దాదాపు అరవై ప్రదర్శనలు ఇచ్చారు.

1983-84లో భారతీయ విద్యాభవన్, న్యూఢిల్లీవారి ఉత్తమ నాట్యకళాకారిణిగా, భిల్వారా ట్రోఫీ కోసం జరిగిన అఖిలభారత నృత్య, సంగీత పోటీల్లో వరసగా 1978, 1979,1980 సంవత్సరాలలో, 1985 లో హైద్రాబాదులో జరిగిన అంతర్ కళాశాల నృత్యపోటీల్లోనూ బహుమతులు పొందారు.

—సి. లలితాకృష్ణ

పనిమనిషి వచ్చి 'బాబుగారు ఏదోకలవరిస్తున్నారు' అంటూ చెప్పింది. ఇద్దరూ గబగబా రాజారావుగారి దగ్గరికెళ్ళారు. ఆయన ఏదో ముద్దగా మాట్లాడుతున్నాడు. సీతమ్మ మసకబారిన కళ్ళతో, భర్తని తట్టి పిల్చింది.

ఆయన పలికేస్థితిలో లేడు. కానీ "సీతా! సీతా!" అంటూ ఏదో చెప్పాలన్నట్టు గొణుగుతున్నాడు.

అది తెలిసి మాట్లాడేమాటలు కావనీ ప్రాణంకన్నా మిన్నగా చూసుకునే ఇల్లాల్ని కలవరిస్తున్నాడనీ, అదీ సంధి ప్రేలాపన అనీ ఇద్దరూ గ్రహించారు.

దుఃఖాన్ని కంట్రోల్‌చేసుకోలేని సీతమ్మ భర్త గుండెల మీద వాలి బావురుమంది.

"ఛ! ఏవిఁటమ్మా ఇది; లేవండి" అంటూ ఆమెని లేవదీశాడు అతుల్.

"అతుల్ మీ మాస్టార్ని ఎలాగైనా బతికించండిరా, ఇలా మంచంలోవున్నావాలురా! స్పృహ లేకపోయినా పరవాలేదు. ఆయన రూపాన్ని చూసుకుంటూ బతుకుతాను" అంటూ వెక్కివెక్కి ఏడవ సాగింది సీతమ్మ. ఆమెని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు అతుల్‌కి.

ఆ రాత్రంతా మరణయాతన అనుభవించి తెల్లవారు జామున శాశ్వతంగా కన్నుమూశాడు రాజారావు.

"సారీ, రాజారావుగారు పోయారు" అన్నాడు డాక్టర్ చివరిసారిగా పరీక్షించి. సీతమ్మ గుండె పగిలిన ట్టయింది. ఒక్కసారి భర్తమీదపడి బావురుమంది. రెండు నిమిషాల్లో తేరుకుని గంభీరంగా అయిపోయింది.

రాజారావుగారి భౌతికకాయం సావిట్లోకి చేరింది. ఆయనతలవైపు ప్రతిమలా కూర్చుండి పోయింది సీతమ్మ. ఫోన్ చెయ్యబోతున్న అతుల్‌తో -

"ఫోన్ ఎవరికి?" అంది.

"రాజావాళ్ళకి చెయ్యద్దూ?" అన్నాడతను.

"ఒద్దు" స్థిరంగా అందామె.

అతను తెల్లబోయాడు.

"రేపు మా వియ్యాల వారిళ్ళలో శుభకార్యాలున్నాయి. రేపే రమ కొడుకు పుట్టినరోజు. ఇప్పుడు నువ్వు ఫోన్ చేసినా వాళ్ళు దొరక్కపోవచ్చు. దొరికినా వెంటనే రాలేక పోవచ్చు. ఒకవేళ ఎలాగోవచ్చినా, ఎంతో ఆనందంగా చేసుకుంటున్న వాళ్ళ ఫంక్షన్స్ తాలూకు వేడుకల్ని పాడుచేశామని అంతాకలిసి చనిపోయిన ఆయన్నీ ఫోన్‌చేసిన మనల్నీ దూషించచ్చు. నన్నేమన్నా ఫరవాలేదు గాని ఆయన్ని వల్లెత్తు మాటంటే నేను సహించలేనురా!"

"చూడు అతుల్! ఆయనకి ప్రాణంలో ప్రాణంగా మసలిన నేనున్నాను. కొడుక్కన్నామిన్నగా సేవలు చేసిన నువ్వున్నావు. అందుకే జరగాల్సిందంతా నీ చేతుల మీదుగా జరిపించు." స్థిరంగా వుంది సీతమ్మగొంతు.

"కానీ..... "

"అతుల్! మీ మాస్టారికి అంతిమ సంస్కారం చెయ్యడం నీకిష్టంలేదా!" సూటిగా అందామె.

"ఛఛ అదేమిటయ్యా! ఇవాళ నేనీ స్థితిలో వుండ డానికి కారకులు మీరూ, మాస్టారే. మీరే ఆదుకోకపోతే ఏ. ముష్టివాడిగానో దొంగగానో మారిపోయేవాణ్ణి" మనస్ఫూర్తిగా అన్నాడు అతుల్.

"అయితే ప్రస్తుతం జరగాల్సింది నువ్వేమాడు వాళ్ళువచ్చాక వాళ్ళబాధ్యతల్ని వాళ్ళకప్పచెప్పుగాని"

"అలాగేనమ్మా, నేనేచేస్తాను. ఈ రూపేణా అయినా మాస్టారి రుణంలో కొంతైనా తీర్చుకుంటాను." అన్నాడు అతుల్.

తర్వాత వూరంతా తరలి వచ్చింది రాజారావుగారికి తుది వీడ్కోలు చెప్పడానికి. రాజారావుగారి శవం పూలరథంలా వూరికి వుత్తరంగా సాగింది. ముందు అగ్నిభాండాన్ని పట్టుకుని అతుల్, శవానికి వెనగ్గా వందలాది జనం బయలుదేరారు.

రాజారావుగారి మొహం నిద్రపోతున్నట్టు ప్రశాంతంగా వుంది.

"మీ బిడ్డల్ని పిలిపించలేక పోయాను. నన్ను క్షమించండి. నిజంగా పున్నామ నరకాన్నించి తప్పించేది పుత్రుడే అయితే, ఆ నరకాన్నించి మన బిడ్డలాంటి అతుల్ తప్పిస్తాడు. తర్వాతి కార్యక్రమాలన్నీ మీ బిడ్డలే చేస్తారు" మనసులో భర్త రూపాన్ని తల్చుకుని నమస్కరించింది సీతమ్మ. భర్త తృప్తిగా చూసినట్టు అనిపించిందామెకి.

ఆపై ఆమెకళ్ళు జలపాతాల్లా వర్షిస్తున్నా ఎందుకో మనసు మాత్రం తేలికయింది.